ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
గురువారం 15 మే 2025

శిల్పవనంలో.. అందాల సోయగం


చారిత్రక ఓరుగల్లులో అందగత్తెల సందడి

- వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోట, రామప్ప క్షేత్రాల సందర్శన
- రెండు బృందాలుగా పర్యటించిన మిస్‌వరల్డ్ కంటెస్టెంట్లు
- భారతీయ సంప్రదాయ వస్త్రధారణలో అందాలభామల హెరిటేజ్ వాక్
- రుద్రేశ్వరుడు, రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు
- అద్భుత శిల్పకళను చూసి ఆశ్చర్యచకితులైన మిస్సమ్మలు
- కాకతీయుల చరిత్ర ఆసక్తిగా ఆలకింపు
- ఆకట్టుకున్న పేరిణీ నృత్యం.. రాణిరుద్రమ నాటక రూపం, లేజర్ షో

7


రామప్ప ఆలయంలోని శిల్పకళను తిలకిస్తున్న సుందరీమణులు


భారత సంప్రదాయ చీరకట్టులో.. వేయిస్తంభాల ఆలయ ఆవరణలో ముద్దుగుమ్మలు


రామప్పలో లేజర్ షో.. ఆలయ శిఖరంపై శివతాండవం..


హనుమకొండ కాకతీయ హరిత హోటల్ వద్ద బతుకమ్మలతో సందడి

సంప్రదాయ చీరకట్టు.. చేతులకు గాజులు.. నుదుటిన తిలకం.. తలలో పూలు.. ఇలా తెలుగుదనం ఉట్టి పడేలా.. అందాల భామలు అద్భుతాల శిల్పవనంలో సందడి చేశారు. చారిత్రక ఉమ్మడి ఓరుగల్లులోని వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోట, రామప్ప ఆలయాలను సందర్శించారు. వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగిన శిల్పకళావైభవాన్ని చూసి ఆశ్చర్యచకితులయ్యారు. హైదరాబాద్ వేదికగా మిస్‌వరల్డ్ పోటీలు జరుగుతున్న నేపథ్యంలో వివిధ దేశాల అందాలభామలకు రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాల విశిష్టతను తెలిపేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా బుధవారం 57మంది సుందరీమణులు.. రెండు బృందాలుగా వేయిస్తంభాల గుడి, వరంగల్ కోట, రామప్ప ఆలయాలను సందర్శించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఫొటోలు దిగారు. ఆలయాలతో పాటు కోట నిర్మాణ విశిష్టతలు, చరిత్ర తెలుసుకుంటూ ముందుకు సాగారు.

- హనుమకొండ / హనుమకొండ సిటీ/ ములుగు (ఆంధ్రజ్యోతి)


వరంగల్ కోటలోని కీర్తి తోరణం వద్ద అందాల భామల హెరిటేజ్ వాక్



త్రివేణి సంగమం.. పుష్కర శోభితం..

నేటి నుంచి కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు

- ఉదయం 5.44 గంటలకు ముహూర్తం
- ప్రారంభించనున్న మాధవానంద సరస్వతి
- భక్తులకు ఇబ్బందుల్లేకుండా సౌకర్యాల కల్పన
- ప్రధానఘాట్ వద్ద సరస్వతీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సీఎం
- నదీ హారతి, ముక్తీశ్వరాలయంలో ప్రత్యేక పూజలకు హాజరు
- పటిష్ఠ ఏర్పాట్లు చేసిన అధికారులు

6



త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా.. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళేశ్వర ముక్తీశ్వరాలయం సన్నిధిలోని త్రివేణి సంగమంలో 'అంతర్వాహిని' సరస్వతీ పుష్కర సంరంభం ఆరంభమవుతోంది. గురువారం ఉదయం జరిగే ఈ అద్భుత ఘట్టం కోసం భక్తజనకోటి ఎదురుచూస్తోంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి జరుగుతున్న ఈ పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 12రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగే ఈ పుష్కరాలకు తరలి వచ్చే వేలాది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసింది. సుమారు రూ.40కోట్లతో పలు పనులను మంజూరు చేసింది. ప్రధాన ఘాట్‌పై సరస్వతీమాత విగ్రహం, జ్ఞానజ్యోతి తీర్థం ఏర్పాటుతో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. మరోవైపు ముక్తీశ్వరాలయం విద్యుద్దీపకాంతుల్లో పుష్కర శోభితమై మెరిసిపోతోంది. గురువారం ఉదయం 5.44గంటలకు మాధవానంద సరస్వతి పుష్కరాలను ప్రారంభించనుండగా.. సాయంత్రం పుష్కర వేడుకల్లో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారు.

- మహదేవపూర్, ఆంధ్రజ్యోతి

జగ్గారెడ్డి వ్యాఖ్యలు అహంకారపూరితం

- ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలి..
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కొలను సంతోష్‌రెడ్డి

రాంనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హంటర్‌రోడ్డులోని బీజేపీ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత నాయకులపై చేసిన దూషణల వలనే అసెంబ్లీ ఎన్నికల్లో జగ్గారెడ్డి ఓటమి చెందాడన్న విషయం మరువొద్దన్నారు. ఎమ్మెల్యే కాకముందే సీఎం అని ప్రచారం చేసుకున్న జగ్గారెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు. జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ పదవి కోసం సీఎం మెప్పు పొందేందుకే ఈటలపై జగ్గారెడ్డి పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడన్నారు. ఆయనకు సరైన సమయంలో బీజేపీ శ్రేణులు బుద్ధిచెబుతారని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు కాశీప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజలకు మేలు చేయాలంటే ఎత్తు, లావు అవసరం లేదని, మంచి బుద్ధి ఉంటే చాలన్నారు. ఇంకోసారి ఆకారాన్ని చులకన చేసి మాట్లాడితే బీజేపీ శ్రేణుల ఆవేశానికి గురికాక తప్పదని హెచ్చరించారు. వెంటనే ఈటలపై చేసిన వ్యాఖ్యలను జగ్గారెడ్డి వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా చేసిన సమయంలో అవినీతికి పాల్పడ్డ జగ్గారెడ్డి.. క్లీన్‌చీట్ ఉన్న ఈటలపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ శ్రీరాములు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు న్యాయం చేయాలి

- రోడ్ల వెంబడి దుకాణాలు పునర్నిర్మించాలి
- మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

మట్టెవాడ, మే 14 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని, వారికి దుకాణాలు పునర్నిర్మించేంత వరకు పోరాడుతామని మాజీ చీఫ్‌విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ హెచ్చరించారు. నగరంలోని చిరు వ్యాపారుల సముదాయాలను మునిసిపల్ సిబ్బంది కూల్చినందుకు నిరసనగా బుధవారం మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎంజీఎం సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. అందెగత్తెల రాక కోసం చిరు వ్యాపారుల జీవితాలను ఆగం చేయొద్దని, చట్టం ప్రకారం వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో వీధి వ్యాపారుల కోసం వెండింగ్‌జోన్లు ఏర్పాటు చేశామని, సముదాయాలను ఏర్పాటు చేసి వసతులు కల్పించడంతోపాటు రుణాలు అందించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారికి అన్యాయం చేస్తోందని, మునిసిపల్ అధికారులు, పోలీసుల దౌర్జన్యంగా దుకాణాలను తొలగించడం అన్యాయమని, వారి పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఓరుగల్లు చరిత్రను విశ్వవ్యాప్తం చేయడానికి తాము వ్యతిరేకం కాదని, అదే సమయంలో చిరు వ్యాపారులను ఆగం చేయొద్దని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా మసూద్, కార్పొరేటర్లు మరుపల్ల రవి, సిద్దం రాజు, చెన్నం మధు, సంకు నర్సింగ్, సోదా కిరణ్, ఇమ్మడి లోహిత రాజు, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేశ్, మేకల బాబురావు, తండమల్ల వేణు, పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ మసూద్, చిలువేరు పవన్, టి.రమేశ్‌బాబు, నయీమొద్దీన్, పుల్ల రమేశ్, కొడకండ్ల సదాంత్, రమేశ్, జానకిరాములు, రాంమూర్తి, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.


కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు



ఇంటర్ ఫలితాలలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని మోక్షను అభినందిస్తున్న చైర్మన్ రవికిరణ్ రెడ్డి

సీబీఎస్ఈ ఫలితాల్లో డీపీఎస్ విద్యార్థుల ప్రభంజనం

ధర్మసాగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ ఇంటర్, పదో తరగతి పరీక్ష ఫలితాలలో ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్టు పాఠశాల చైర్మన్ వి. రవికిరణ్ రెడ్డి బుధవారం తెలిపారు. 8ఏళ్లుగా విజయపరంపర కొనసాగుతున్నట్టు ఆయన తెలిపారు. ఇంటర్ ఫలితాలలో పోలు మోక్ష 97 శాతం ఉత్తీర్ణతను సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు తెలిపారు. అలాగే మిగతా విద్యార్థులు 90 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడమే డీపీఎస్ పాఠశాల ప్రత్యేకత అని కొనియాడారు. అనంతరం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను చైర్మన్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ రాజిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ ఇన్నారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మోషన్‌లో ఉచిత విద్య

రాంనగర్, మే 14(ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నయీంనగర్‌లోని కోటా రాజస్థాన్ మోషన్ కళాశాలలో ఉచిత విద్య అందించనున్నట్లు కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఫీజుల్లో రాయితీలు ఇస్తామన్నారు. 570 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు 100 శాతం రాయితీ, 550పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు 50 శాతం రాయితీ, 500పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు 25శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఐఐటీ, మెడికల్ సీట్లను సాధించడమే లక్ష్యంగా నిష్ణాతులైన అధ్యాపక బృందంతో తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మిగతా వివరాలకు 9963417910 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

పీజీ అడ్మిషన్ల కోసం పోర్టల్స్ ప్రారంభం

హనుమకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) పీజీ అడ్మిషన్లు, కౌన్సెలింగ్ కోసం సీసీఎంటీ-2025, సీసీఎంఎన్-2025 పోర్టల్స్ ప్రారంభించినట్లు నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి తెలిపారు. సీసీఎంటీ-2025లో మొత్తం 76 ప్రముఖ విద్యాసంస్థలు, సీసీఎంఎన్-2025లో 32 సంస్థలు పాల్గొంటున్నట్లు తెలిపారు. వీటిలో 31 జాతీయ సాంకేతిక విద్యాసంస్థలు, జాతీయ ఎలక్ట్రానిక్, సమాచార సాంకేతిక విద్యాసంస్థ, కొన్ని ఐఐఐటీలు, కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చిన సాంకేతిక విద్యాసంస్థలు, ఇండియన్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లు ఉన్నాయన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు రెండు కౌన్సెలింగ్‌ల కోసం అధికారిక పోర్టల్స్ ప్రారంభించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి సాంకేతిక సంస్థలలో పీజీ కోర్సులలో ప్రవేశం పొందాలనుకునే అర్హత గల అభ్యర్థులు జూన్ 4వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. సందేహాల నివృత్తి కోసం నిట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు షురూ..

కేయూ క్యాంపస్ మే 14, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బుధవారం డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరో సెమిస్టర్ పరీక్షలు, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెమిస్టర్ విద్యార్థులకు పరీక్షలు జరిగాయి. ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో 118 పరీక్షల కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. కాగా, బుధవారం హనుమకొండ ప్రాంతంలోని పలు కళాశాల పరీక్షల కేంద్రాలను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ పి.వెంకటయ్య, డాక్టర్ ఎం.తిరుమలదేవిలు పరిశీలించారు. మిగతా పరీక్షలన్నీ షెడ్యూల్ మేరకు జరుగుతాయని వెల్లడించారు.



త్రివేణి సంగమానికి ముస్తాబైన కాళేశ్వరం ఆలయం

త్రివేణీ సంగమం.. పుష్కర శోభితం..

- నేటి నుంచి కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలు
- ప్రారంభించనున్న మాధవానంద సరస్వతి
- ప్రధానఘాట్ వద్ద సరస్వతీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- పటిష్ఠ ఏర్పాట్లు చేసిన అధికారులు

మహదేవపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా, దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళేశ్వర-ముక్తీశ్వరాలయం సన్నిధిలోని త్రివేణి సంగమంలో నేటి నుంచి 'అంతర్వాహిని' సరస్వతీ పుష్కర సంరంభం ఆరంభం కానుంది. గురువారం అరుణోదయ వేళ అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తొలిసారి అధికారికంగా 12రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్న సరస్వతి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఈ పుష్కరాలను అంగరంగ వైభవంగా జరపాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం రూ.40కోట్ల నిధులు మంజూరు చేయడంతో పలు పనులు చేపట్టారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పలుమార్లు సమీక్షలు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించడంతో కాళేశ్వరాలయానికి, త్రివేణి సంగమానికి పుష్కర శోభ సంతరించుకుంది. ప్రధాన పుష్కరఘాట్‌లో నదిలోకి వెళ్లి పుణ్య స్నానాలు ఆచరించడానికి ఇబ్బందులు పడే భక్తుల కోసం జల్లు స్నానాలు చేసేలా షవర్లు ఏర్పాటు చేశారు. ప్రధాన ఘాట్‌పై సరస్వతిమాత విగ్రహం, జ్ఞానజ్యోతి తీర్థం ఏర్పాటు చేయడంతో ఆధ్యాత్మికత సంతరించుకుంది. ఎండల నుంచి భక్తులు సేదతీరేందుకు చలువపందిళ్లు ఏర్పాటు చేయగా భక్తుల వసతి కోసం టెంట్‌సిటీ నిర్మాణం చేశారు. శ్రీకాళేశ్వర-ముక్తీశ్వర ఆలయం ఆవరణలో పుష్కర శోభ సంతరించుకుంది. విద్యుత్ కాంతుల వెలుగులు నేత్రానందం గావిస్తున్నాయి. కాళేశ్వరంలో పుష్కరాల వేడుకలకు సంబంధించి, సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతం కోసం ఏర్పాటు చేసిన పలు భారీ ఫ్లెక్సీలు కనిపిస్తున్నాయి. పుష్కరాలు జరిగే 12రోజుల పాటు హోమాలు నిర్వహించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. సరస్వతి పుష్కరాలను సమర్థవంతంగా, వైభవంగా జరిపే క్రమంలో రోజుకు సుమారు 50వేల మంది భక్తులు వస్తారన్న అంచనాల మధ్య 19శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఉదయం 5.44గంటలకు ప్రారంభం

కాళేశ్వర త్రివేణి సంగమంలో 26 వతేదీ వరకు పన్నెండు రోజులపాటు సాగే సరస్వతి పుష్కరాలు గురువారం ఉదయం 5.44గంటలకు ప్రారంభం కానున్నాయి. బృహస్పతి మిధున రాశిలో ప్రవేశించిన అనంతరం ఉదయాన్నే ప్రధాన పుష్కర ఘాట్‌లో శ్రీ గురుమదనానంద సరస్వతీ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతిస్వామీజీ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. తెల్లవారుజామున కాళేశ్వర-ముక్తీశ్వర ఆలయం నుంచి దేవాదాయశాఖ అధికారులు, వేదపండితులు, ఆలయ అర్చకులు, స్వామీజీ, భక్తులు మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల మధ్య త్రివేణిసంగమానికి వెళ్లి ప్రత్యేకపూజల అనంతరం పుష్కరాలను ప్రారంభిస్తారు.

అద్భుత ఘట్టంలో పాల్గొననున్న సీఎం



సరస్వతీ పుష్కరాల సంరంభం ఆరంభమవుతున్న రోజున ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కాళేశ్వరానికి రానున్నారు. త్రివేణి సంగమం వద్ద సాయంత్రం ఆయన పలువురు మంత్రులతో కలిసి వేడుకల్లో పాల్గొని పలు అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారు. దీంతో జిల్లా యంత్రాంగం హెలీప్యాడ్ నిర్మాణం సహా పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. గురువారం సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో కాళేశ్వరం చేరుకోనున్న సీఎం ప్రధాన పుష్కర ఘాట్‌కు చేరుకుంటారు. గతంలో త్రివేణిసంగమం వద్ద వీఐపీ ఘాట్‌గా పిలుచుకునే ప్రస్తుత పుష్కరాల ప్రధాన్‌ఘాట్‌కు సరస్వతి ఘాట్‌గా నామకరణం చేస్తారు. అక్కడ తమిళనాడు నుంచి తెచ్చిన 17అడుగుల ఏకశిల సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. త్రివేణి సంగమంలో పుష్కర స్నానం అనంతరం కాళేశ్వర- ముక్తీశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. సాయంత్రం 5.30గంటలకు పుష్కర ఘాట్‌లో వేదపండితులు వైభవంగా సమర్పించే సరస్వతీ నది హారతిలో పాల్గొంటారు. సీఎం రాక నేపథ్యంలో ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో పలువురు ఐపీఎస్‌లు, 3,500మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.



సీఎం ఆవిష్కరించనున్న సరస్వతీ విగ్రహం



మాధవానంద సరస్వతి



హోమాలకు సిద్ధంగా ఉన్న యాగశాల



పుష్కర ఘాట్‌లో జల్లు స్నానం కోసం ఏర్పాటు చేసిన బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్



బందోబస్తుపై చర్చిస్తున్న సీఎం భద్రతాధికారి, కలెక్టర్, ఎస్పీ

కాళేశ్వరానికి పుష్కర కళ

పెయింటింగ్స్, ఏర్పాట్లతో త్రివేణి సంగమ తీరానికి కొత్తరూపు

మహదేవపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరానికి పుష్కర కళ సంతరించుకుంది. గోడలపై వేసిన వివిధ ఆకృతుల పెయింటింగ్స్ భక్తులను ఆకర్షిస్తున్నాయి. దేవాలయం చుట్టూ ఉన్న ప్రహరీలపై మహాదేవుడు, పలు ఆకర్షణీయమైన చిత్రాలు భక్తులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. చిత్ర కళాకారుల కళా నైపుణ్యాన్ని పలువురు కొనియాడుతున్నారు. అంతేకాకుండా దర్శనానికి వచ్చే ప్రజలు ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక కాళేశ్వరానికి సీఎం రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మిగతా రాజకీయ పార్టీల నాయకులు కూడా భక్తులకు ఆహ్వానం పలుకుతూ ఫ్లెక్సీలు కట్టారు. ఇదిలా ఉంటే మంగళవారం సాయంత్రం వీచిన గాలి దుమారాలకు కొన్ని చోట్ల ఫ్లెక్సీలు చెదిరిపోయాయి. దీంతో నాయకులు వాటిని సరిచేసేపనిలో నిమగ్నమయ్యారు.



ఉత్సవ కమిటీ ఎన్నిక

సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో 18 మందితో నూతన ఉత్సవ కమిటీ బుధవారం ఏర్పాటైంది. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఆ కమిటీ సభ్యులకు ఆలయ శేష వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. గురువారం నుంచి పుష్కరాలు పూర్తయ్యే వరకు ఉత్సవ కమిటీ సభ్యులు సేవలందిస్తారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో ఈ కమిటీనేఇ నియమించగా.. ఇందులో మోహన్‌శర్మ, దుర్గయ్య, సీతారాం, సత్యనారాయణ, పద్మ, నర్సయ్య, నర్సింగరావు, రాజమల్లు, ఓదెలు, రాజయ్య, ప్రశాంత్‌రెడ్డి, శ్రీధర్‌రావు, కుమారస్వామి తదితరులున్నారు.



కాళేశ్వరంలో వెలసిన ఫ్లెక్సీలు

ప్రత్యేక ఆకర్షణగా హ్యాండ్లూమ్ స్టాళ్లు

పుష్కరాల సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన హ్యాండ్లూమ్స్ స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బుధవారం ఈ స్టాళ్లను కలెక్టర్ రాహుల్ శర్మ ప్రారంభించారు. మహిళా సంఘాలు తమ కృషిని ప్రతిబింబించేలా నాణ్యమైన హస్తకళా ఉత్పత్తులు, సేంద్రియ ఆహార పదార్థాలు, పచ్చడులు ప్రతీ ఒక్కరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఆర్డీవో నరేష్, పరిశ్రమల అధికారి సిద్ధార్థ, డీపీఎం భీమారపు రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేసిన నూతన పుష్కర కమిటీ



మహిళా సంఘాల స్టాళ్లు ఏర్పాటు చేసిన అధికారులు

పుష్కరాలకు ఏర్పాట్లు పూర్తి

- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజా రామయ్యర్
- కాళేశ్వరంలో సరస్వతీ ఘాట్ వద్ద పనుల పరిశీలన

మహదేవపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో గురువారం నుంచి జరిగే సరస్వతీ పుష్కరాలకు ఏర్పాట్లు పూర్తయినట్లు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజా రామయ్యర్ అన్నారు. బుధవారం సరస్వతీ ఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్రివేణి సంగమంలో మొట్టమొదటి సారిగా కాశీ పండితులతో నిర్వహించే నదీ హారతిలో పాల్గొంటారని తెలిపారు. జిల్లా యంత్రాంగం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, భక్తుల పట్ల గౌరవంగా వ్యవహరించాలన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

సరస్వతీ పుష్కరాల్లో పాల్గొనే సిబ్బంది ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. బుధవారం మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఆలయంలోని కల్యాణ మండపంలో విధులు కేటాయించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరస్వతీ పుష్కరాలను వైభవంగా జరుపుతున్నామని, అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేశామన్నారు. రోజూ వేలాది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, ప్రతీ అధికారికి క్షేత్రస్థాయిలో ఉండి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. గురువారం ఉదయం ప్రారంభమయ్యే సరస్వతీ పుష్కరాలకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరవుతారని, సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి సరస్వతి మాత విగ్రహాన్ని ఆవిష్కరించి.. పుష్కర స్నానం, గోదావరి హారతి కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. ప్రభుత్వం ఈ పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, కుంభమేళాకు వెళ్లలేని వారు ఈ పుష్కరాలకు వచ్చే అవకాశం ఉందని, అంకితభావంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకటరావు, అదనపు కలెక్టర్లు అశోక్, విజయలక్ష్మీ, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




ఏర్పాట్లను పరిశీలిస్తున్న శైలజా రామయ్యర్, కలెక్టర్ తదితరులు

చర్చనీయాంశమైన పోలీసుల రీల్స్

మహదేవపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సోషల్ మీడియా రీల్స్ అనేవి సర్వసాధారణమైపోయాయి. ఎలాంటి వారైనా... వృత్తి, వయసుతో సంబంధం లేకుండా రీల్స్ చేయడం మాత్రం పరిపాటైంది. ఈ క్రమంలో కొందరు చిక్కుల్లో పడుతుండగా.. మరికొందరు వైరల్ అవుతున్నారు. అయితే త్రివేణి సంగమం వద్ద పుష్కర విధుల్లో ఉన్న ఓ మహిళా కానిస్టేబుల్, మరో ముగ్గురు ఎస్సైలు పడవలో ప్రయాణించే సమయంలో తీసుకున్న ఓ రీల్స్ వీడియో వైరల్ అవుతోంది. యూనిఫామ్ ధరించి విధులను మరిచి రీల్స్ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాల్సిన పోలీసులే ఇలా రీల్స్ చేయడమేంటని పలువురు ఆరోపిస్తున్నారు.

కాటారంలో వేగంగా పనులు

పుష్కరాల నేపథ్యంలో సెంట్రల్ డివైడర్ స్తంభాలకు రోప్‌లైట్లు ఏర్పాటు



కాటారం, మే 14 (ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్ర మైన కాటారం మండల కేంద్రంలో సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. కాళేశ్వరం సరస్వతీ పుష్క రాలు-2025 నేపథ్యంలో జిల్లాలోని 353(సీ) జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ డివైడర్లపై నెలకొల్పిన స్తంభాలకు రోప్‌లైట్లు అమరుస్తున్నారు. జాతీయ పతాకంలోని మూడు రంగుల రోప్ లైట్లను అధికారులు అమర్చడానికి చర్యలు చేపట్టారు. దీంతో మండలంలోని గారెపల్లి, ధన్వాడ, మేడిపల్లి, కొత్తపల్లి గ్రామాల పరిధిలోని సెంట్రల్ లైటింగ్ పోల్స్‌కు రంగురంగుల రోప్ లైట్లు అమర్చే కార్యక్రమం చేప ట్టారు. ఈ కార్యక్రమాలను ఎంపీడీవో బాబు, ఎంపీ వో వీరస్వామి పర్యవేక్షించగా, పంచాయతీ కార్యద ర్శులు సమీర్‌ఖాన్, ఉమాదేవి, రాకేష్, జ్యోత్స్న తదిత రులు పనులు చేయిస్తున్నారు.

సరస్వతీ పుష్కరస్నానంతో పునీతులు కావాలి

శాయంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం త్రివేణి సంగమంలో గురువారం నుంచి 26 వరకు జరిగే సరస్వతీ పుష్కరాలలో స్నానం ఆచరించి పునీతులు కావాలని పెద్దకోడెపాక రాజరాజేశ్వరస్వామి దేవాలయ ప్రధానార్చకుడు డాక్టర్ అనుదీప్ శర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. స్వస్తిశ్రీ విశ్వనామ సంవత్సరం వైశాఖమాసం గురువారం తెల్లవారుజామునుంచి పుష్కరాలు ప్రారంభం అవుతాయని తెలిపారు. సరస్వతీ పుష్కరాలు 12 సంవత్సరాలకు ఒకసారి వస్తాయని, సరస్వతీ అంతర్వాహిని త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరించి, పితృదేవతలకు తర్పణాలు, నదీ పూజలు, ప్రాయశ్చితాలు, పిండప్రదానాలు చేయడం వల్ల అత్యంతం పుణ్య ఫలం సిద్ధిస్తుందన్నారు. అలాగే పుణ్యస్నానాల అనంతరం జంటలింగాలైన కాళేశ్వరం ముక్తీశ్వరస్వామిని దర్శించుకుని, స్వామివారి అనుగ్రహం పొందాలని సూచించారు.

శిల్పవనంలో..

అందాల సోయగం


వేయిస్తంభాల గుడిలో రుద్రేశ్వరుడికి పూజలు చేస్తున్న అందాలభామలు


హనుమకొండ హరిత హోటల్ వద్ద బతుకమ్మలతో సందడి చేసిన మిస్సమ్మలు


రామప్ప ఆలయ నిర్మాణంలో వాడిన తేలియాడే ఇటుక, సాండ్‌బాక్స్ విధానాన్ని సుందరీమణులకు వివరిస్తున్న నిట్ మాజీ ప్రొఫెసర్ పాండురంగారావు

చారిత్రక ఓరుగల్లులో అందగత్తెల సందడి

- వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోట, రామప్ప సందర్శన
- రెండు బృందాలుగా పర్యటించిన మిస్‌వరల్డ్ కంటెస్టెంట్లు
- భారతీయ సంప్రదాయ వస్త్రధారణలో హెరిటేజ్ వాక్

హనుమకొండ / హనుమకొండ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి) తెలుగుదనం ఉట్టి పడేలా.. నుదుటిపై తిలకం దిద్ది.. సంప్రదాయ చీరల్లో ప్రపంచ అందగత్తెల ఓరుగల్లు పర్యటన ఉత్సాహంగా సాగింది. బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లాకు వచ్చిన 57మందితో కూడిన రెండు బృందాలు చారిత్రక వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోట, రామప్ప ఆలయాలను సందర్శించాయి. ఈ క్రమం లో సాయంత్రం 4.35గంటలకు హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌కు చేరుకున్న 22మంది మిస్ వరల్డ్‌పోటీదారుల్లో అర్జెంటీనా, బ్రెజిల్, బొలివియా, ఈక్వెడార్, ఎల్ సాల్వేడార్, గ్వాటిమాల, హైతి, హోండూరస్, మెక్సికో, నికరాగ్వా, పరాగ్వే, పనమా, పెరూ, అమెరికా, సూరినామ్, వెనుజుల, బెలిజ్ దేశాలకు చెందిన సుందరీమణులకు బతుకమ్మలతో స్వాగతం పలికారు. తీరొక్కపూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళలు సంప్రదాయ డోలు, వాయిద్యాలతో ఆత్మీయ స్వాగతం పలికారు. మహిళలతో కలిసి అందగత్తెలు బతుకమ్మ ఆట, పాటలతో నృత్యాలు చేస్తూ హుషారెత్తించారు.



అందాల భామలకు ఘన స్వాగతం..

ఓరుగల్లు పర్యటనలో భాగంగా తొలుత హనుమకొండలోని హరితకాకతీయ హోటల్‌కు చేరుకున్న వివిధ దేశాలకు చెందిన 24 మంది ప్రపంచ సుందరీమణులకు బుధవారం హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య, సత్యశారద, సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ఘన స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి టూరిజం శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో సాయంత్రం 4:42 నిమిషాలకు హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌కు వారు చేరుకున్నారు. బస్సు దిగిన సుందరీమణులకు పుష్పగుచ్ఛాలు అందజేసి పూలుచల్లుతూ స్వాగతం పలికారు. మహిళలు బతుకమ్మలతో స్వాగతం పలికారు. సుందరీమణులు బతుకమ్మలను చేతబట్టుకుని నృత్యాలు చేశారు. అక్కడ ఉన్న మహిళలతో సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు. అనంతరం హోటల్లో ఏర్పాటుచేసిన రూములకు చేరుకుని సంప్రదాయ చీరలను ధరించారు. కాకతీయ హోటల్ ముందు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఎదుట ఫొటోలకు ఫోజులు ఇచారు. అనంతరం 6గంటలకు అక్కడి నుంచి వేయిస్తంభాల అలయానికి బస్సులో వెళ్లారు. వేయిస్తంభాల ఆలయం వద్ద వరంగల్ ఎంపీ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ తదితరులు పుష్పగుచ్ఛాలు, పూలమాలలతో సుందరీమణులకు స్వాగతం పలికారు. రెడ్‌కార్పెట్ స్వాగతంతో పోటీదారులు ఆలయంలోకి ఒక్కో ప్రదేశాన్ని సందర్శిస్తూ తమ భావాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఇక్కడ మొత్తం 42 నిమిషాల పాటు పర్యటన సాగింది.



కోటలో సుందరీమణులు కోలాహలం

కాకతీయ సామ్రాజ్య కళా వైభవానికి, శిల్పకళానైపుణ్యానికి నిదర్శనంగా నిలిచిన వరంగల్ కోటను సుందరీమణులు తిలకించారు. సంప్రదాయబద్ధంగా చీర కట్టులోనే వరంగల్ కోటను సందర్శించారు. తమ పాలనలో కాకతీయ రాజులు వరంగల్ కోటను అద్భుత నిర్మాణాలతో తీర్చిదిద్దిన తీరును, కోటలోని మూడు వృత్తాకార పొరలు, భారీ రాతి ద్వారాల (కాకతీయుల కీర్తి తోరణాల)ను పరిశీలించి ముద్దుగుమ్మలు ముగ్ధులయ్యారు. ఈ కీర్తి తోరణాలే రాష్ట్ర చిహ్నంగా ఏర్పాటు చేసినట్టు తెలుసుకుని సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. కీర్తితోరణం వద్ద పోటాపోటీగా మిస్సమ్మలు ఫొటోలకు ఫోజులు ఇచ్చారు. కోట నిర్మాణం, చరిత్రతో పాటు స్వయంభూ శివాలయం లాంటి కాకతీయుల నిర్మాణాలు, ప్రాముఖ్యతలను సౌండ్ అండ్ లైట్ ద్వారా ప్రదర్శిస్తూ మిస్ వరల్డ్ పోటీదారులకు వివరించారు. కోటలోని శిల్పవనంలో ఒయ్యారాలు ఒలకపోస్తూ.. శిలలను పరిశీలించారు. అద్భుత శిలా నైపుణ్యానికి ముగ్ధులయ్యారు. ఫొటోలకు ఫోజులిస్తూనే.. సెల్ఫీలు దిగుతూ సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ తమ ఆనందాన్ని తమ దేశంలోని వారితో పంచుకున్నారు. చేతులు ఊపుతూ.. జోరుగా.. హుషారుగా కోటలో మిస్సమ్మలు సందడి చేశారు. చారిత్రక వరంగల్ కోట ముద్దుగుమ్మల రాకతో సందడిగా మారింది.

కాకతీయులు నిర్వహించే పేరిణి శివతాండవ నృత్య రూపకాన్ని ఆసక్తిగా తిలకించారు. రాణిరుద్రమ నృత్య రూపకం సుందరీమణులను మంత్రముగ్ధులను చేసిం ది. కోటలో ఏర్పాటు చేసిన ఫ్లియా మార్కెట్‌ను సుందరీ మణులు సందర్శించారు. వీరికి ఇటీవలే జీఐ ట్యాగ్ పొందిన చపాట మిర్చిని చూపించారు. మిర్చి ప్రత్యేకతలను వివరిం చారు. అలాగే వరంగల్ పసుపును పరిచయం చేస్తూ, దాని ప్రత్యేకతలను తెలిపారు. అలాగే అంతర్జాతీయ గుర్తింపు పొందిన వరంగల్ దర్రీస్ (జంపకానాలు) గురించి వివరించా రు. ఈ దర్రీస్ ప్రత్యేకతలను వివరించారు. దర్రీస్‌లను పరిశీలించటంతో పాటు చపాట మిర్చి రుచికి గల కారణా లను తెలుసుకునేందుకు మిస్సమ్మలు ఆసక్తి చూపారు. కాగా, మిస్‌వరల్డ్ పోటీదారుల పర్యటనకు పోలీసులు మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. సుమారు వెయ్యిమందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలుతీసుకున్నారు.

వరంగల్ వచ్చిన మిస్సమ్మలకు జ్ఞాపికలు

వరంగల్ కోటలో శిల్ప సౌందర్యానికి ముగ్ధులైన అందాలభామలకు వరంగల్ కళాకారులు అరుదైన జ్ఞాపికలను అందించారు. వరంగల్‌నగరంలోని రంగశాయిపేటకు చెందిన కళాకారులు ఆరు నెలలుగా శ్రమించి తయారు చేసిన షీల్డులను ప్రపంచ అందగత్తెలకు అందించారు. ఈ షీల్డులపై కాకతీయ కీర్తితోరణం, రాణీరుద్రమ ప్రతిమలను చెక్కారు. అలాగే నూలుతో తయారు చేసిన బ్యాగ్‌లను అందిచారు. వీటితో పాటు వరంగల్‌కు ప్రత్యేకమైన దర్రీస్‌ను కూడా సుందరీమణులకు బహుమతులుగా అందించారు. కాగా, తెలంగాణ సంస్కృతి అద్భుతమని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలు అద్భుతమని మిస్ అర్జెంటీనా, మిస్ కెనడా తదితర అందాలభామలు పేర్కొన్నారు. ఇక్కడికి రావడం చాల అనందంగా ఉందని పేర్కొన్నారు.


వేయిస్తంభాల గుడి ఆవరణలో అందాలభామలతో ఓరుగల్లు ప్రజాప్రతినిధులు

వేయిస్తంభాల ఆలయంలో అనందంగా..

తెలుగుదనం ఉట్టి పడేలా, సంప్రదాయబద్ధంగా చీరలను ధరించి, నుదుట తిలకం దిద్ది చారిత్రత్మక వెయ్యి స్తంభాల ఆలయానికి చేరుకున్నా వీరికి అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. తొలుత సుందరీమణులు ఆలయం ఆవరణలో ఉన్న కోనేరును పరిశీలించారు. శిలా శాసనంలో ఉన్న ఆలయ చరిత్రను గైడ్ వివరించారు. సుందరీమణుల కోసం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తాంబాళాల్లో చెంబులోని నీటితో కాళ్లను కడుక్కున్నారు. ఆలయంలోని నందిని చూసి ఆశ్చర్యపోయారు. నంది విగ్రహం ఇక్కడ ఎందుకు ఉందని గైడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆలయ విశిష్టత, నిర్మాణ శైలిని గైడ్ వివరించారు. వెయ్యి స్తంభాలతో ఆలయాన్ని నిర్మించారని, ఇసుకతో పునాదులను ఏర్పాటు చేశారని తెలిపారు. వేయి ఏళ్ల అవుతున్న చెక్కు చెదరకుండా ఆలయం ఉండటానికి కారణం సాండ్ టెక్నాలెజీ అని వివరించారు. శివుడు, విష్ణువుతో పాటు సూర్యుడు కొలువైన పుణ్యక్షేత్రంగా సుందరీమణులకు వివరించారు. అనంతరం నంది విగ్రహం వద్ద మిస్సమ్మలు పోటీపడి ఫొటోలకు ఫోజులు ఇచ్చారు. బ్యూటీఫుల్ అంటూ నంది విగ్రహం వద్ద సందడి చేశారు. కొందరు అతివలు నంది చెవులో తమ కోర్కెలు చెప్పారు. అనంతరం దక్షిణం వైపు పునరుద్ధరించిన కల్యాణ మండపం వద్దకు వెళ్లి విద్యుత్ కాంతులు జిగేల్ జిగేల్ అంటుండగా.. ఫొటోలకు ఫోజులిచ్చారు. అధికారులకు, మీడియా, అక్కడి వచ్చిన వారికి నమస్కార్ అంటూ చేతులు ఊపుతూ ఉత్సాహన్ని చూపించారు. అనంతరం గర్భగుడిలో శివలింగం వద్ద రుద్రేశ్వరస్వామికి ముద్దుగుమ్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్‌శర్మ ప్రపంచ అందగత్తెలకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి, పూర్ణకుంభ స్వాగతంతో పాటు వేదమంత్రాలు, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. రుద్రేశ్వరస్వామికి అభిషేకాలు చేయించారు. ముద్దుగుమ్మలకు తీర్థప్రసాదాలను అందించి జరంచుకండువాలతో సత్కరించారు. సుమారు గంట సేపు వెయ్యి స్తంభాల ఆలయంలో గడిపారు. హిస్టారికల్ టెంపుల్.. థౌసండ్ ఇయర్ టెంపుల్.. ఓం నమోశ్శివాయ అని సుందరీమణులతో అర్చకులు అనిపించారు. మంగళ వాయిద్యాలతో ఆలయంలోని తీసుకెళ్లారు. ఉత్తిష్ఠి గణపతి దర్శనం కల్పించి రుద్రేశ్వరస్వామికి జలాభిషేకం నిర్వరింపచేశారు. పూజల నిర్వహణ అనంతరం సుందరీమణులు ప్రసాదం అందుకున్నారు.

ఆకట్టుకున్న పేరణీ తాండవం.. చపాట.. దర్రీస్‌లు..

ఓరుగల్లు అంటనే గుర్తుకు వచ్చే అనేక అంశాల్లో ఒకటి పేరణీ నృత్యం. కాకతీయుల కాలంలోనే పురుడు పోసుకున్న పేరణి నృత్యాన్ని వరంగల్ కోటలో ప్రదర్శించి మిస్సమ్మలను ఆశ్చర్య పరిచారు. యుద్ధ సమయంలో


వేయిస్తంభాల గుడి ఆవరణలో అందాలభామలు, రామప్పలో తాంబాళాల్లో కాళ్లు కడుక్కొంటున్న సుందరీమణులు, రామప్ప అందాలను ఫోన్‌లో బంధిస్తూ..


రామప్ప ఆలయ ఆవరణలో సుందరీమణులతో మంత్రి సీతక్క, జిల్లా అధికారులు


రామప్ప ఆవరణలో పేరిణీ నృత్య ప్రదర్శన


వరంగల్ కోటలో..


వరంగల్ కోట వద్ద చపాట మిర్చిని చూస్తున్న ఓ అందాలభామ

అందాల పోటీలపై పసలేని విమర్శలు

- రాష్ట్ర పర్యాటకానికి విస్తృత ప్రచారం
- పర్యాటకాభివృద్ధే లక్ష్యంగా పోటీలు
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ


వరంగల్ కోటలో అందాలభామలతో మంత్రి సురేఖ

హనుమకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): హైదరా బాద్‌లో జరుగుతున్న ప్రపంచసుందరి పోటీల నిర్వహణపై కొందరు పసలేని విమర్శలు చేస్తున్నా రని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధాని కి, అందాల పోటీలకు ముడిపెట్టి విమర్శలు చేయడంలో అర్థం లేదన్నారు. బుధవారం వరంగ ల్ కోట ప్రాంగణంలో ప్రపంచ సుందరీమణుల హెరిటేజ్ వాక్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడారు. యుద్ధం ప్రారంభం కావడానికి ఏడాదికి ముందే అందాల పోటీల నిర్వహణ కసరత్తు మొదలైందని గుర్తు చేశారు. పైగాఅందాలపోటీలను కించపరిచి మాట్లాడడం సరికాదని కొట్టిపారేశారు. పోటీల సందర్భం గా అనేక ప్రశ్నలను అడగడం ద్వారా మహిళల అంతర సౌందర్యాన్ని ఆవిష్క రింపచేస్తారన్నారు. ఓరుగల్లు అంటే నే తెలంగాణ సంస్కృ తి, సంప్రదాయాలు, చరిత్రకుకు నిలువెత్తు నిదర్శనమన్నా రు. మిస్‌వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం తెలంగాణకు గర్వకారణమని, వరంగల్ భవ్య, దివ్య, నవ్య నగరంగా పేరుగాంచిందన్నారు. ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు వారసత్వ సంపద చారిత్రక ప్రదేశాలు గొప్ప అనుభూతిని కలిగిస్తాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సార థ్యంలో రాష్ట్రంలో వరంగల్ నగరాన్ని రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తున్నట్టు మంత్రి సురేఖ చెప్పారు. త్వరలో మామునూరుకు ఎయిర్‌పోర్టు రానున్నదని అన్నారు. మిస్‌వరల్డ్ గ్లోబల్ ఈవెంట్ అని, పర్యాటక ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటేందుకు ఇది ఒక అవకాశమని అన్నారు. ఈ కార్యక్రమం తెలంగాణను ప్రపంచ దృష్టిలో నిలిపి, దాని బ్రాండ్ విలువను, ఆకర్షణను పెంచుతుందన్నారు.

కోట అందాలు అద్భుతమన్న సుందరీమణులు

కాగా, కోటను సందర్శించిన కొందరు సుందరీమణులు వరంగల్ కోట అద్భుతాలను ప్రశంసించారు. అర్జెంటీనా, కెనడా, పనామా, యునైటెడ్ స్టేట్స్, పరాగ్వే తదితర దేశాల సుందరీమణులు వరంగల్ కోటలో పర్యటన తమకు దివ్యానుభూతిని మిగిల్చిందన్నారు. తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలు అద్భుతమని వర్ణించారు. భారతదేశ రాజ్యం, ఇక్కడ ప్రజాస్వామ్యం ఎంతో బలమైనవని, సుస్థిరమైనవన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు తమను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి,, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎంఎల్‌ఏ కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, జీడబ్ల్యుఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాంకడే తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుడా రూపొందించిన సావనీర్‌ను సుందరీమణులకు అందచేశారు.

రామప్పలో సుందరీమణుల సందడి

అబ్బురపరిచే ఏర్పాట్ల మధ్య అందగత్తెల హెరిటేజ్ వాక్

ములుగు/ వెంకటాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరీమణులు రామప్పలో బుధవారం సందడి చేశారు. వివిధ దేశాల నుంచి వచ్చిన 33మంది ముద్దుగుమ్మలు అబ్బురపరిచే ఏర్పాట్ల మధ్య హెరిటేజ్ వాక్ చేశారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న అతిథులకు ఎర్రని తివాచీ పరిచి కొమ్ముకోయ బృందంతో స్వాగతం పలికారు. ఆలయ సమీపంలోని రాతి గోడ వద్ద అతిథుల కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక తాంబాళాల్లో కాళ్లు కడుక్కొని ఆలయంలోకి ప్రవేశించి ముద్దుగుమ్మలు యునెస్కో గుర్తింపు పొందిన చారిత్రక రామప్ప ఆలయాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు. కాకతీయుల కాలంలో చెక్కిన శిల్పాలను చూసి ఆశ్చర్యానికి లోనయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు హరీష్‌శర్మ, ఉమాశంకర్ రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి ముద్దుగుమ్మలకు శఠగోపం పెట్టి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎన్ఐటీ మాజీ ప్రొఫెసర్ పాండురంగారావు రామప్ప ఆలయ విశిష్టతను సుందరీ మణులకు వివరించారు. నీటిలో తేలియాడే ఇటుకను, సాండ్‌బాక్స్ టెక్నాలజీ వాడి దేవాలయాన్ని నిర్మించిన విధానం గురించి వివరించారు. ఆలయ గైడ్స్ విజయ్‌కుమార్, వెంకటేష్ మదనిక శిల్పాల మనోహరాలను వివరించారు. అనంతరం సుందరీ మణులు ఆలయ నుంచి బయటకు వస్తూ 'తెలంగాణ... జరూర్ ఆనా' అంటూ నినదించారు. వారి వేషధారణ భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా చీరలు, పరికిణీలు, జడకొప్పు, కొప్పులో మల్లెపూలతో ఔరా అనేలా అందాల భామలు చూపరులను ఆకట్టుకున్నారు. కాకతీయ శిల్పులు చెక్కిన శిల్పాలతో కదిలే జవరాళ్లు పోటీ పడుతూ నువ్వా.. నేనా.. అన్నట్లు మరీ సెల్ఫీలు దిగారు.



ఫొటోగ్రాఫర్లకు ఫొజులిస్తూ సంబరపడ్డారు. మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర, జిల్లా ఎస్పీ శబరీష్‌లతో కలిసి ముద్దుగుమ్మలు గ్రూప్ ఫొటో దిగారు. అనంతరం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. అందాల అతిథులకు అటవీశాఖ ఆధ్వర్యంలో వెదురు కర్రతో తయారు చేసిన అందమైన బహుమతులను మంత్రి సీతక్క, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీష్ చేతుల మీదుగా అందజేశారు. జిల్లా ఎస్పీ శబరీష్ మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. బందోబస్త్‌లో ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, వెంకటాపూర్ ఎస్సై జక్కుల సతీష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాకతీయ రాజుల పరిపాలన, చరిత్రాత్మక అంశాలను నృత్య రూపంలో కళాకారులు చూపించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ అలేఖ్య పూజారి రాణిరుద్రమదేవి వేషధారణలో మెప్పించారు. అనంతరం పేరణి రంజిత్‌కుమార్ 65 మంది కళాకారులచే శివతాండవం అందరినీ ఆకట్టుకున్నాయి. రాణి రుద్రమదేవి చరిత్ర, ఆమె వివాహ వేడుకలను కనులకు కట్టినట్టుగా ప్రదర్శించడం పట్ల ప్రపంచ సుందరీమణులు హర్షం వ్యక్తం చేశారు. లేజర్‌షో ద్వారా ఆలయ శిఖరంపై ప్రదర్శించిన శివతాండవం తదితర చిత్రాలు ఆకట్టుకున్నాయి.

చారిత్రక కట్టడాల నిలయం : మంత్రి సీతక్క

ములుగు జిల్లా కేవలం తెలంగాణ చిత్రపటంలో ఒక భాగం మాత్రమే కాదని, చారిత్రక కట్టడాలకు నిలయ మని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. కాకతీయులు ఏలిన గడ్డ, సమ్మక్క-సారలమ్మలు కొలువైన నిలయమ న్నారు. మలుగు జిల్లా చరిత్రకు సజీవ సాక్ష్యమని కొనియాడారు. నేను మంత్రిగానే కాకుండా ఈ ప్రాంత బిడ్డగా ఈ వేడుకకు హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ శబరీష్, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎస్పీ రవీందర్, డీఎంహెచ్‌వో గోపాల్‌రావు పాల్గొన్నారు.

కళాశాల నూతన భవన నిర్మాణానికి నేడు శంకుస్థాపన

గిర్మాజీపేట,మే14 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ కృష్ణకాలనీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నూతన భవననిర్మాణానికి గురువారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేస్తారు. ఏడు దశాబ్దాల క్రితం ఏర్పాటుచేసిన ఈ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణానికి అరబిందో ఫార్మ కంపెనీ ముందుకొచ్చింది. రూ.5కోట్లతో రెండు అంతస్తుల్లో 15 తరగతి గదులను నిర్మిస్తోంది. కళాశాల ఆవరణలో జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, పి.శ్రీపాల్ రెడ్డి, తీన్మార్ మల్లన్న, కుడా చైర్మన్ ఇ.వెంకట్రాంరెడ్డి, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి యోగితా రాణా, రాష్ట్ర ఇంటర్ బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్య, కలెక్టర్ డాక్టర్ సత్యశారద తదితరులు పాల్గొంటారని ప్రిన్సిపాల్ ఎం.శరధృతి తెలిపారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నాం

గుర్రపు శ్రీనివాస్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రంగశాయిపేట

ముఖాముఖి



ఆంధ్రజ్యోతి: విద్యార్థులకు మీరు కల్పించే సదుపాయాలేమిటి?

ప్రిన్సిపాల్: అధునాతన ప్రొజెక్టర్లతో కూడిన కంప్యూటర్ ల్యాబ్, అన్ని వసతులతో కూడిన లైబ్రరీ, డిజిటల్, స్మార్ట్‌బోర్డుల ద్వారా బోధన, ఉచిత వైఫై సౌకర్యం, ఎన్ఎస్ఎస్, ఆటలకు సువిశాలమైన ఆటస్థలం, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, స్కాలర్‌షిప్, బస్‌పాస్ సౌకర్యం ఉంది.

ఆంధ్రజ్యోతి: ప్రవేశాలు ఎలా పొందాలి?

ప్రిన్సిపాల్: 'దోస్త్' పోర్టల్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చును. రంగశాయిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోడ్ '2440'ను ఎంపిక చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: మీ కళాశాల ప్రత్యేకతలు ఏమిటి?

ప్రిన్సిపాల్: అత్యంత అనుభవం, అర్హత కలిగిన అధ్యాపకులు ఉన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బోధిస్తారు. పటిష్టమైన ప్రణాళికతో విద్యార్థులకు అవగతమయ్యే పద్ధతిలో బోధన ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: విద్యార్థుల భవిష్యత్తుకు మీరిచ్చే భరోసా ఏమిటి?

ప్రిన్సిపాల్: డిగ్రీ విద్యతో పాటు వారి భవిష్యత్తుకు పునాదులు వేసే విధంగా విద్యార్థుల ఆసక్తి మేరకు ఉద్యోగాలకు సంబంధించిన సబ్జెక్టులను బోధిస్తాం. ఇంగ్లీష్ లాంగ్వేజ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై విద్యార్థులు పట్టు సాధించే విధంగా ఇక్కడ విద్యాబోధన సాగుతోంది.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులకు ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పిస్తున్నారా;

ప్రిన్సిపాల్: 'టాస్క్' ద్వారా విద్యార్థులకు ఉద్యోగనైపుణ్యాలనూ శిక్షణ ఇస్తున్నాం. 'డీట్' ద్వారా ఉద్యోగాల అన్వేషణ కోసం సహాయం చేస్తున్నాం.

- వరంగల్ ఎడ్యుకేషన్ (ఆంధ్రజ్యోతి)

పోలీసు దిగ్బంధంలో 'ఖిలా'

స్థానికులకు నిరాశ మిగిల్చిన సుందరీమణుల సందర్శన ● భారీ బందోబస్తుతో జనం ఇబ్బందులు ● రోడ్లన్నీ నిర్మానుష్యం



ఖిలావరంగల్ రోడ్డుపై బారికేడ్లు పెట్టిన పోలీసులు

హనుమకొండ/ఖిలావరంగల్ మే 14 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ కోటలో బుధవారం నిర్వహించిన సుందరీమణుల హెరిటేజ్ వాక్ స్థానికులకు నిరాశను మిగిల్చింది. తమ ప్రాంతంలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని వారు తిలకించలేకపోయారు. పోలీసులు భారీ భద్రత, అడుగడుగునా ఆంక్షల వల్ల కార్యక్రమం జరుగుతున్న దరిదాపుల్లోకి కూడా వారు రాలేకపోయారు. కనీసం దూరం నుంచైనా చూసే అవకాశం లేకుండా కోట ప్రాంగణం చుట్టూరా నల్లతెరలను కట్టారు.

సుందరీమణులు సందర్శించే కోటలోని ప్రాంగణం వద్ద పోలీసు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అడుగడుగునా పోలీసులను మోహరించారు. వీఐపీల కోసం ప్రత్యేకంగా ఒక ప్రవేశ ద్వారాన్ని, మీడియాకు మరొక ప్రవేశ మార్గాన్ని ఏర్పాటు చేశారు. పాస్‌లున్నవారినే లోపలికి అనుమతించారు. చివరకు మీడియాను సైతం పరిమితంగానే పంపించారు. ప్రవేశ ద్వారం వద్ద మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసి నిశితంగా తనఖీలు చేశారు. దీనితో ప్రపంచ అందెగత్తెలను చూసే భాగ్యాన్ని దూరం నుంచి అయినా చూసే భాగ్యానికి స్థానికులు నోచుకోలేకపోయారు. సుందరీమణులను చూసేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో రాగా, వారిని పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. దీనితో వారు తీవ్ర నిరాశకు లోనయ్యారు. తమ ప్రాంతానికి వచ్చిన అందాల భామలను చూసే అదృష్టానికి నోచుకోలేకపోయామని వాపోయారు. అత్యంత అరుదైన ఇలాంటి కార్యక్రమంలో భాగస్వాములు అయ్యే అవకాశం తమకు కొద్దిసేపైనా కల్పించాల్సి ఉందన్నారు.

సుందరీమణులను దూరం నుంచి అయినా చూసే అవకాశం ప్రజలకు లేకుండా ప్రాంగణం చుట్టూరా గ్రిల్స్‌పైన నల్లని తెరలను కట్టారు. భామల హెరిటేజ్ వాక్‌ను బయట నుంచి తిలకించేందుకు వీలుగా కనీసం ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేయాల్సి ఉందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ప్రాంగణానికి దూరంగా గ్రౌండ్ దగ్గరే వాహనాలను నిలిపివేశారు. ఖుష్‌మహల్ దగ్గరే ప్రజలను పోలీసులు అడ్డుకున్నారు. వీఐపీ వాహనాలను సైతం అక్కడే నిలిపివేశారు. దీంతో వారంతా కాలినడకన కోట ప్రాంగణానికి చేరుకోవలసి వచ్చింది. కోట ప్రాంతాన్ని పోలీసులు అష్ట దిగ్బంధం చేశారు. కోటలోకి ప్రవేశించే నాలుగు దారులను మూసివేశారు. కోటకు వచ్చే వాహనాలను ఇతర మార్గాలకు మళ్లించారు. కోట ప్రాంతంలోని దుకాణాలన్నిటినీ పోలీసులు మూసివేయించారు. ఒక రోజు ముందే హెచ్చరికలు జారీ చేశారు.

● వేయిస్తంభాల గుడిలో ఏర్పాట్లపై అసంతృప్తి..

హనుమకొండ సిటీ: మిస్‌వరల్డ్ పోటీదారులు వేయిస్తంభాల ఆలయ సందర్శన వేళ ఏర్పాట్లపై అసంతృప్తులు వెల్లుబికాయి. ఆలయ విద్యుత్ ఆలంకరణ ఆకట్టుకునేలా ఉండకపోవడం లోటుగా కనిపించింది. ఆలయంలోని సుందరీమణులతో ప్రవేశించిన ఉన్నతాధికారులు ఇతరులకు కూడా కనీసం కూర్చునే ఏర్పాటు జరగలేదు. సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టలేదు. అందాల భామలు సందర్శన, వారికి అనువైన పరిస్థితుల కల్పనపైనే అధికారగణం దృష్టిచేసిందే తప్ప.. మిగతా అంశాలపై దృష్టి సారించలేదనే అసంతృప్తులు వ్యక్తమయ్యాయి. మరోవైపు మీడియాపై ఆంక్షలు విధించారు. కవరేజీ చేసుకునే కనీస అవకాశాలు కూడా కల్పించకుండా వ్యవహరించారు.



కోటలో శిల్పాల చుట్టూ నల్ల పరదాలు కట్టిన దృశ్యం

అందగత్తెలకు పసందైన విందు

రాత్రి 11గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం





ప్రపంచ సుందరీమణుల కోసం ఏర్పాటు చేసిన విందు భోజనం

హనుమకొండ టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): 20 దేశాల నుంచి వచ్చిన ప్రపంచ సుందరీమణుల కోసం బుధవారం హనుమకొండలోని హరితకాకతీయ హోటల్‌లో పసందైన విందును పర్యాటక శాఖ ఏర్పాటు చేసింది. సుందరీమణులు హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయం, ఖిలా వరంగల్ పర్యటన ముగించుకుని రాత్రి 9.30 గంటలకు హరితకాకతీయ హోటల్‌కు చేరుకున్నారు. హోటల్‌లో ఏర్పాటుచేసిన వివిధ దేశాలకు చెందిన పసందైన విందుతో పర్యాటక శాఖ అధికారులు ఆతిథ్యం ఇచ్చారు. ఒక్క ప్లేట్ భోజనం ఖర్చు సుమారు రూ.5వేలకు పైగా ఉంటుందని అధికారులు చెప్పారు. డిన్నర్ చేసిన అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బస్సుల్లో హైదరాబాద్‌కు రాత్రి 11గంటలకు బయలుదేరారు. కాగా, సుందరీమణుల పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విజయవంతం కావడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

భగ్గుమన్న మహిళా సంఘాలు

● సుందరీమణుల పర్యటనను అడ్డుకునే యత్నం

● వేయిస్తంభాల గుడి ఎదుట ప్లకార్డులతో నినాదాలు

వరంగల్ క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలో ప్రపంచ సుందరీమణుల పర్యటనపై మహిళా సంఘాలు భగ్గుమన్నాయి. వేయి స్తంభాల ఆలయానికి అందాల భామలు మరో పది నిమిషాల్లో రాబోతున్న సమయంలో సుమారు సాయంత్రం 6గంటల ప్రాంతంలో (ఎన్ఎఫ్ఐడబ్ల్యు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్), చైతన్య మహిళా సమాఖ్య, పౌరహక్కుల సంఘం, డెమొక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలు, యువకులు రోడ్డుపైకి వచ్చి ప్లకార్డులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రంలో విద్య, వైద్యం సరిగ్గా అందక ప్రజలు అల్లాడుతుంటే ప్రభుత్వం అందాల భామల పేరుతో ప్రజాధనాన్ని వృథాగా ఖర్చు చేస్తోందని నినాదాలు చేశారు. హనుమకొండ సీఐ నేతృత్వంలో సిబ్బంది వారందరినీ ఆదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. కాగా, నిరసన కార్యక్రమం ఉంటుందని ముందుగానే పసిగట్టిన నిఘా వర్గాలు.. స్థానిక పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు అప్రమత్తమవుతున్న తరుణంలో ప్లకార్డులతో మహిళలు రోడ్డెక్కారు. దీంతో కంగుతున్న పోలీసులు.. వారిని వాహనాల్లో ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. పోలీసులు ఆదుపులోకి తీసుకున్న వారిలో చైతన్య మహిళా సమాఖ్య నాయకులు అనిత, కళ, రమ, ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర నాయకురాలు సదాలక్ష్మి, జ్యోతి, పౌర సంఘాల నాయకులు జయంత్, మంచాల, డీఎస్ఏ నాయకుడు శివ ఉన్నారు.



హనుమకొండ పోలీసుల ఆదుపులో ఉన్న నిరసనకారులు



ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న మహిళలు

గుడుంబా రవాణాదారుల అరెస్టు

కాజీపేట, మే 14 (ఆంధ్రజ్యోతి) - గుడుంబా రవాణా చేస్తున్న ముగ్గురిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చెన్నారావుపేట మండలం ఇండ్యా తండాకు చెందిన గుగులోతు వాలి, పల్లెపు సాంబరాజు, పల్లెపు మహేశ్‌ల కాజీపేట రైల్వేస్టేషన్ నుంచి ఆటోలో బుధవారం గుడుంబా తరలిస్తుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. 12 లీటర్ల గుడుంబా, ఆటో, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యేలు

హసన్‌పర్తి, మే 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను మాజీ ఎమ్మెల్యేలతో పాటు పలువురు మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు ఒడితెల సతీష్ బాబు, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ పాడి మల్లారెడ్డి, డైరెక్టర్ మ్యాక భగవాన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, నద్దునూరి నాగరాజు, సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



సంఘీభావం తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

ఖిలావరంగల్, మే 14(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని రాష్ట్ర భవననిర్మాణ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. మంగళవారం శివనగర్ తమ్మెరభవన్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గన్నారపు రమేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక నాలుగు కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఎమ్డీ యాకూబ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎం.సాగర్, నర్రా ప్రతాప్, దామెర కృష్ణ, జన్ను రాజు, లలిత, సౌందర్య, రవి తదితరులు పాల్గొన్నారు.

● పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్ సిటీ: సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన పోస్టర్లను మంగళవారం కాశిబుగ్గ జంక్షన్‌లో ఐఎఫ్‌టీయూ నాయకులు ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా ఐఎఫ్‌టీయూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు ఎన్నో ఏళ్ల పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను బీజేపీ పాలకులు రద్దు చేసి నాలుగు లేబర్ చట్టాలుగా తెచ్చారని ఆక్షేపించారు. కార్మిక వర్గానికి సాంఘిక భద్రత లేకుండా చేస్తున్నారని, కార్మికుల హక్కులను కాపాడుకునేందుకే ఈ నెల 20న సమ్మె నిర్వహిస్తున్నామని, కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎలకంటి రాజేందర్, మహబూబ్‌ఖాన్, బండి కుమార్, రాజేందర్, సదానందం, వెంకటస్వామి, రాజేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



కాశిబుగ్గలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడి ఎన్నిక



దాసరి రాజశేఖర్

పోచమ్మమైదాన్, మే 14 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ చేనేత విభాగం వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా 13వ డివిజన్ వీవర్స్ కాలనీకి చెందిన దాసరి రాజశేఖర్‌ను, ఆర్గనైజింగ్ సెక్రటరీగా 12వ డివిజన్‌కు చెందిన బాసాని కరుణాకర్‌ను నియమించారు. మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందేలా కృషి చేస్తామని అన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 25 మందికి జరిమానా

మట్టెవాడ, మే 14 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 25 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ బుధవారం రూ. 13వేల జరిమానా విధించారు. ఇదే కేసులో వరంగల్ రంగశాయిపేటకు చెందిన మహ్మద్ యూసుఫ్, లేబర్‌కాలనీ ప్రాంతానికి చెందిన శ్యాంసంగ్, వనమాల కనపర్తికి చెందిన దూసరి రవి, హుస్నాబాద్‌కు చెందిన ఉప్పు రాజుకు రెండు రోజుల జైలుశిక్ష విధించారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఇద్దరికి రూ. 1000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.

బుర్ర రాములు ఆశయాలను కొనసాగించాలి

● వర్ధంతి సభలో పౌరహక్కుల సంఘాల నాయకుల పిలుపు



నివాళి అర్పిస్తున్న పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకులు

ఖిలావరంగల్, మే 14(ఆంధ్రజ్యోతి): మానవహక్కుల నేత స్వర్గీయ బుర్ర రాములు ఆశయాలను నేటి యువత కొనసాగించాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి బాదావత్ రాజు, సీపీఐ-ఎంఎల్, న్యూడెమొక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రావుల బాలరాజు పిలుపునిచ్చారు. బుధవారం ఖిలావరంగల్ అమరవీరుల స్థూపం వద్ద బుర్ర రాము లు 14వ వర్ధంతి, యాదిసభను మానవహక్కుల వేదిక జిల్లా నాయకుడు బండి కోటేశ్వ ర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే బుర్ర రాములు ప్రగతిశీల ఉద్యమాలను నిర్మించారని, కార్మిక, కర్షక, హరిజన, గిరిజ, ఆదివాసీల హక్కులకోసం ఉద్యమించారని గుర్తు చేశారు. 1980 నుంచి రెండు దశాబ్దాల చీకటి కాలంలో నాటి ప్రభుత్వాలు పౌర, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తుంటే డాక్టర్ బాలగోపాల్, నర్రా ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి పీడిత, తాడిత ప్రజల పక్షాన నిలబడ్డారని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే నివాళి అని అన్నారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకులు హరికృష్ణ, పాలకుర్తి సత్యం, సాదు రాజేష్, శ్రీనివాస్, యాదగిరి, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్, వరంగల్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు తీగల జీవన్, మైదం సంజీవ, బి.అయిలయ్య, మైదం పాణి, జి.హరిబాబు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యం పెంచేందుకే ఉపాధ్యాయులకు శిక్షణ

● జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో జ్ఞానేశ్వర్

వరంగల్ ఎడ్యుకేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇస్తున్న వృత్త్యంతర శిక్షణను ఉపాధ్యాయులందరూ సద్వినియోగం చేసుకోవాలని డీఈవో ఎం. జ్ఞానేశ్వర్ కోరారు. బుధవారం హంటర్ రోడ్ ఖమ్మం బైపాస్‌రోడ్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ... బోధనలో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు శిక్షణ కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సృజన్‌తేజ, హెడ్మాస్టర్ వెంకటేశ్వర్లు, కోర్సు కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు, డీసీఈబీ కార్యదర్శి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

వరంగల్ క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు ఇన్స్‌పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వరంగల్ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న డి.రమణమూర్తిని హైదరాబాద్ మల్టీజోన్-1 కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో సిద్ధిపేట కమిషనరేట్‌లోని కమ్యూనికేషన్ విభాగంలో పనిచేస్తున్న జె.శ్యాంసుందర్‌ను వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు కేటాయిస్తూ ఉత్తుర్వుల్లో పేర్కొన్నారు.

ఇలా వదిలేస్తే ఎలా?



● ఐదేళ్లుగా సాగుతున్న స్మార్ట్ రోడ్డు పనులు

● ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు

● వెంటనే పూర్తి చేయాలని డిమాండ్

శంభునిపేట, మే 13(శంభునిపేట): ఐదేళ్ల క్రితం ప్రారంభించిన పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. అసంపూర్తిగా వదిలేయడంతో అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా అటు అధికారులు గాని, ఇటు కాంట్రాక్టర్ గాని పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రంగశాయిపేట గవిచర్ల క్రాస్ రోడ్ నుంచి కరీమాబాద్ గుండా వై జంక్షన్ బ్రిడ్జి వరకు వెళ్ళే ఆర్అండ్‌బీ రోడ్‌ను ఐదేళ్ళ క్రితమే స్మార్ట్ రోడ్‌గా ప్రతిపాదన చేశారు. పనులు ప్రారంభం అయినప్పటి నుంచి నత్తనడక సాగుతున్నాయి. ఇష్టానుసారంగా గుంతలు తవ్వి వదిలేశారు. అదేవిధంగా రంగశాయిపేట మహంకాళీ జంక్షన్‌లో ఇటీవలే రోడ్ తవ్వి మట్టిని తరలించారు. తర్వాత పనులు ఆపివేశారు. దీంతో అందులోకి వర్షపు నీరు చేరింది. రంగశాయిపేట నుంచి వరంగల్, ఉర్సు, గవిచర్ల మార్గాల వైపు వెళ్ళాలన్నా, శంభునిపేట జంక్షన్‌కు చేరుకోవాలన్నా ఈ మార్గం గుండానే వెళ్ళాలి. అయితే అక్కడ ఎటువంటి సూచిక బోర్డులు పెట్టకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. గవిచర్ల క్రాస్ జంక్షన్‌లో సైతం బుధవారం పనులు ప్రారంభించారు. కాని ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయలేదు.

● కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..

నిబంధనల ప్రకారం ప్రధాన మార్గాల్లో పనులు చేపడితే ముందస్తుగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. దారి మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలి. కాని కాంట్రాక్టర్ ఇవేమీ పట్టించుకోలేదు. ఈ విషయంలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు ఇబ్బందిపడకుండా పనులు చేయాలి..

- బక్కి రంజిత్, బీజేపీ నాయకులు



పట్టణాల్లో మౌలిక వసతులు పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం స్మార్ట్‌సిటీ పథకాన్ని తీసుకొచ్చింది. అందులో భాగంగా వరంగల్‌లో పలు చోట్ల స్మార్ట్ రోడ్ పనులు ప్రారంభించారు. ఏళ్ళు గడుస్తున్నా ఇంకా పనులు పూర్తి కాలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

ఆంధ్రజ్యోతి ★★
ANDHRAJYOTHY
5
గ్రేటర్ వరంగల్
గురువారం 15 మే 2025


శిల్పవనంలో.. అందాల సోయగం

చారిత్రక ఓరుగల్లులో అందగత్తెల సందడి


రామప్ప ఆలయంలోని శిల్పకళను తిలకిస్తున్న సుందరీమణులు


భారత సంప్రదాయ చీరకట్టులో.. వేయిస్తంభాల ఆలయ ఆవరణలో ముద్దుగుమ్మలు


హనుమకొండ కాకతీయ హరిత హోటల్ వద్ద బతుకమ్మలతో సందడి


రామప్పలో లేజర్ షో.. ఆలయ శిఖరంపై శివతాండవం..


- వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోట, రామప్ప క్షేత్రాల సందర్శన
- రెండు బృందాలుగా పర్యటించిన మిస్‌వరల్డ్ కంటెస్టెంట్లు
- భారతీయ సంప్రదాయ వస్త్రధారణలో అందాలభామల హెరిటేజ్ వాక్
- రుద్రేశ్వరుడు, రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు
- అద్భుత శిల్పకళను చూసి ఆశ్చర్యచకితులైన మిస్సమ్మలు
- కాకతీయుల చరిత్ర ఆసక్తిగా ఆలకింపు
- ఆకట్టుకున్న పేరిణీ నృత్యం.. రాణిరుద్రమ నాటక రూపం, లేజర్ షో

7

సంప్రదాయ చీరకట్టు.. చేతులకు గాజులు.. నుదుటిన తిలకం.. తలలో పూలు.. ఇలా తెలుగుదనం ఉట్టి పడేలా.. అందాల భామలు అద్భుతాల శిల్పవనంలో సందడి చేశారు. చారిత్రక ఉమ్మడి ఓరుగల్లులోని వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోట, రామప్ప ఆలయాలను సందర్శించారు. వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగిన శిల్పకళావైభవాన్ని చూసి ఆశ్చర్యచకితులయ్యారు. హైదరాబాద్ వేదికగా మిస్‌వరల్డ్ పోటీలు జరుగుతున్న నేపథ్యంలో వివిధ దేశాల అందాలభామలకు రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాల విశిష్టతను తెలిపేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా బుధవారం 57మంది సుందరీమణులు.. రెండు బృందాలుగా వేయిస్తంభాల గుడి, వరంగల్ కోట, రామప్ప ఆలయాలను సందర్శించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఫొటోలు దిగారు. ఆలయాలతో పాటు కోట నిర్మాణ విశిష్టతలు, చరిత్ర తెలుసుకుంటూ ముందుకు సాగారు.

- హనుమకొండ / హనుమకొండ సిటీ/ ములుగు (ఆంధ్రజ్యోతి)


వరంగల్ కోటలోని కీర్తి తోరణం వద్ద అందాల భామల హెరిటేజ్ వాక్



త్రివేణి సంగమం.. పుష్కర శోభితం..

నేటి నుంచి కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు

- ఉదయం 5.44 గంటలకు ముహూర్తం
- ప్రారంభించనున్న మాధవానంద సరస్వతి
- భక్తులకు ఇబ్బందుల్లేకుండా సౌకర్యాల కల్పన
- ప్రధానఘాట్ వద్ద సరస్వతీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సీఎం
- నదీ హారతి, ముక్తీశ్వరాలయంలో ప్రత్యేక పూజలకు హాజరు
- పటిష్ఠ ఏర్పాట్లు చేసిన అధికారులు

6

త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా.. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళేశ్వర ముక్తీశ్వరాలయం సన్నిధిలోని త్రివేణి సంగమంలో 'అంతర్వాహిని' సరస్వతీ పుష్కర సంరంభం ఆరంభమవుతోంది. గురువారం ఉదయం జరిగే ఈ అద్భుత ఘట్టం కోసం భక్తజనకోటి ఎదురుచూస్తోంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి జరుగుతున్న ఈ పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 12రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగే ఈ పుష్కరాలకు తరలి వచ్చే వేలాది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసింది. సుమారు రూ.40కోట్లతో పలు పనులను మంజూరు చేసింది. ప్రధాన ఘాట్‌పై సరస్వతీమాత విగ్రహం, జ్ఞానజ్యోతి తీర్థం ఏర్పాటుతో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. మరోవైపు ముక్తీశ్వరాలయం విద్యుద్దీపకాంతుల్లో పుష్కర శోభితమై మెరిసిపోతోంది. గురువారం ఉదయం 5.44గంటలకు మాధవానంద సరస్వతి పుష్కరాలను ప్రారంభించనుండగా.. సాయంత్రం పుష్కర వేడుకల్లో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారు.

- మహదేవపూర్, ఆంధ్రజ్యోతి

జగ్గారెడ్డి వ్యాఖ్యలు అహంకారపూరితం

- ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలి..
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కొలను సంతోష్‌రెడ్డి

రాంనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హంటర్‌రోడ్డులోని బీజేపీ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత నాయకులపై చేసిన దూషణల వలనే అసెంబ్లీ ఎన్నికల్లో జగ్గారెడ్డి ఓటమి చెందాడన్న విషయం మరువొద్దన్నారు. ఎమ్మెల్యే కాకముందే సీఎం అని ప్రచారం చేసుకున్న జగ్గారెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు. జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ పదవి కోసం సీఎం మెప్పు పొందేందుకే ఈటలపై జగ్గారెడ్డి పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడన్నారు. ఆయనకు సరైన సమయంలో బీజేపీ శ్రేణులు బుద్ధిచెబుతారని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు కాశీప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజలకు మేలు చేయాలంటే ఎత్తు, లావు అవసరం లేదని, మంచి బుద్ధి ఉంటే చాలన్నారు. ఇంకోసారి ఆకారాన్ని చులకన చేసి మాట్లాడితే బీజేపీ శ్రేణుల ఆవేశానికి గురికాక తప్పదని హెచ్చరించారు. వెంటనే ఈటలపై చేసిన వ్యాఖ్యలను జగ్గారెడ్డి వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా చేసిన సమయంలో అవినీతికి పాల్పడ్డ జగ్గారెడ్డి.. క్లీన్‌చీట్ ఉన్న ఈటలపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ శ్రీరాములు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు న్యాయం చేయాలి

- రోడ్ల వెంబడి దుకాణాలు పునర్నిర్మించాలి
- మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

మట్టెవాడ, మే 14 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని, వారికి దుకాణాలు పునర్నిర్మించేంత వరకు పోరాడుతామని మాజీ చీఫ్‌విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ హెచ్చరించారు. నగరంలోని చిరు వ్యాపారుల సముదాయాలను మునిసిపల్ సిబ్బంది కూల్చినందుకు నిరసనగా బుధవారం మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎంజీఎం సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. అందెగత్తెల రాక కోసం చిరు వ్యాపారుల జీవితాలను ఆగం చేయొద్దని, చట్టం ప్రకారం వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో వీధి వ్యాపారుల కోసం వెండింగ్‌జోన్లు ఏర్పాటు చేశామని, సముదాయాలను ఏర్పాటు చేసి వసతులు కల్పించడంతోపాటు రుణాలు అందించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారికి అన్యాయం చేస్తోందని, మునిసిపల్ అధికారులు, పోలీసుల దౌర్జన్యంగా దుకాణాలను తొలగించడం అన్యాయమని, వారి పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఓరుగల్లు చరిత్రను విశ్వవ్యాప్తం చేయడానికి తాము వ్యతిరేకం కాదని, అదే సమయంలో చిరు వ్యాపారులను ఆగం చేయొద్దని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా మసూద్, కార్పొరేటర్లు మరుపల్ల రవి, సిద్దం రాజు, చెన్నం మధు, సంకు నర్సింగ్, సోదా కిరణ్, ఇమ్మడి లోహిత రాజు, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేశ్, మేకల బాబురావు, తండమల్ల వేణు, పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ మసూద్, చిలువేరు పవన్, టి.రమేశ్‌బాబు, నయీమొద్దీన్, పుల్ల రమేశ్, కొడకండ్ల సదాంత్, రమేశ్, జానకిరాములు, రాంమూర్తి, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.


కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

• వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుపై బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి హరీశ్‌రావు అసత్య ఆరోపణలు మానుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు బుధవారం ఒకప్రకటనలో హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్ష నాయకులు నిత్యం బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, వారి మాటలు ప్రజలు నమ్మడంలేదన్నారు. ధాన్యం కొనుగోలులో గతంలో కంటే యాసంగి సీజన్‌లో ఇప్పటికే 65శాతం మేర ధాన్యం కొనుగోలు పూర్తయిందన్నారు. గడిచిన రెండేళ్ల యాసంగితో పోలిస్తే 100 శాతం అధికంగా కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు రైతులను పటించుకోలేదని, ప్రతిపక్షంలోకి రాగానే రైతులు గుర్తుకు వచ్చారని విమర్శించారు. రాష్ట్రంలో జోరుగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని, 43 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దొడ్డు రకం ధాన్యానికి రూ.2,300, సన్న రకం ధాన్యానికి రూ.2,330లు రైతులకు మద్దతు ధర అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాక సన్న రకం ధాన్యానికి రూ.500 అదనంగా బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 90 లక్షల తెల్ల రేషన్ కార్డు కుటుంబాలకు చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

భూ భారతితో పరిష్కారం లభించేనా!

వర్ధన్నపేట, మే 14 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కొత్తగా తెచ్చిన 'భూ భారతి' చట్టంతో తమ సమస్యలకు పరిష్కారం దొరికేనా? అని రైతులు ఎదురు చూస్తున్నారు. పోర్టల్ గురించి అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామీణ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయడంతో ఇక భూ బాధలు గట్టెక్కినట్లేనన్న భరోసాతో ఉన్నారు. ధరణిస్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చింది. వరంగల్ జిల్లాలో వర్ధన్నపేట మండలం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైంది. రైతులు అభిప్రాయాలు, సూచనల అనంతరం మార్పులు, చేర్పులతో పూర్తి స్థాయిలో అమలుకు శ్రీకారం చుట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ధరణితో దగాపడ్డామని, భూ సమస్యలతో సతమతమవుతున్నామని, ప్రస్తుత చట్టంతోనైనా న్యాయం దొరుకుతుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

వర్ధన్నపేట మండలంలో చిన్న, సన్నకారు రైతులే అధికంగా ఉన్నారు. సాగుపై ఆధారపడిన జీవితాలకు భూముల ధరలకు రెక్కలు రావడం సంతోషకరమే అయినా భూ సమస్యలు పెరిగి ఆందోళనకు గురిచేస్తోంది. దానికి తోడు ధరణిరావడంతో సాగుకాలం తొలగించడం, పట్టాకాలం ప్రమాణికంగా తీసుకోవడం మరింత ఇబ్బందిగా మారింది. ధరణికి ముందు 40ఏళ్ల కిందట భూములు కొనుగోలు చేసుకుని సాగు చేసుకుంటున్న రైతుల పేర్లు కూడా పట్టాకాలంతో (రికార్డు) నుంచి తొలగించారు. చాలా మంది రైతులు నాడు రెవెన్యూ అధికారులు చేతి రాతతో రాసి ఇచ్చిన పహాణీలనే నమ్మారు. దాని ఆధారంగానే చాలా మంది రుణాలు తీసుకున్నారు. పట్టా పాసు పుస్తకం ఉంది కాదా కబ్జాలో మనమే ఉన్నామనే భరోసాతో ఉన్నారు.

గుంటలుగా మారిన ఎకరాలు

ధరణి రావడంతో రికార్డుల్లో చాలమంది పేర్లు లేకుండాపోయాయి,



ఎప్పుడో అమ్మేసుకున్న వారి పేర్లు తిరిగి రికార్డుల్లో చేరాయి. కొంతమంది ఆర్ఓఆర్‌లో సాదాబైనామా మీద పట్టా చేసుకున్నా వారివి కూడా రికార్డుల్లో లేకుండా పోయాయి. ఇదిలా ఉండగా ఎకరాల్లో ఉన్న భూమి రికార్డుల్లో గుంటలుగా మారింది. ఇదేమిటని అడిగిన బాధిత రైతులకు ధరణిలో ఎగిరిపోయాయని, తమ చేతుల్లో ఏమి లేదని అధికారులు చేతులు ఎత్తేశారు. నాడు అవసరాల కోసం భూమి విక్రయించుకున్న రైతుల పేర్లు తిరిగి రికార్డులో రావడంతో మరలా విక్రయించారు. అలా వీలుకాని పక్షంలో నాడు తక్కువ ధరకు ఇచ్చాం ప్రస్తుతం మరిన్ని డబ్బులు ఇస్తే పట్టా చేస్తామని వసూళ్లకు పాల్పడుతున్నారు. మరికొంత మంది మా పేర్ల మీద భూమి వచ్చింది. మాకు భూమి కావాలని నాడు కొనుగోలు చేసిన వారిని కోర్టుల చుట్టు తిప్పుతున్నారు. ఇలా ధరణితో అనేక మంది రైతులు అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

పెండింగ్‌లో దరఖాస్తులు

మండలంలో చాల కాలంగా 15 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో పీవోపీ ఒకటి, మ్యూటేషన్ 6, సక్సెషన్ 4, డేటా కలెక్షన్‌లో 4 ఉన్నాయి. ఉన్నతాధికారుల లాగిన్‌లో 82 దరఖాస్తులు ఉన్నాయి.

గ్రామాల్లోనే పరిష్కారం

ప్రస్తుత భూ భారతి ద్వారా ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా గ్రామస్థాయిలోనే రికార్డుల నమోదు ప్రక్రియ ఉండడంతో చాలా సమస్యలకు అక్కడే పరిష్కారం లభించే అవకాశం ఉందని చట్టం పేర్కొంటుంది. రైతుల భూమిని సర్వే చేసి మ్యాప్ సిద్ధం చేయడంతో భూమి ఎక్కడ ఎంత ఉందనే విషయం బయటకు తెలుస్తుంది. భూ హక్కులు ఏ విధంగా సంక్రమించాయనేది రికార్డుల్లో నమోదు చేస్తారు. దీంతో అక్రమ పట్టాలు తొలగిపోయే అవకాశం ఉంది.

ఆధార్.... భూధార్

ఆధార్ కార్డు లాగే భూధార్ కార్డును తెచ్చారు. రికార్డులో తప్పులను సవరణ చేయడం, భూ హక్కు ఉండి రికార్డులో లేని వారి పేర్లను రికార్డులో నమోదు చేస్తారు. గతంలో రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదు చేసినా పరిష్కారం చేయకుండా కోర్టుకు వెళ్లమని సంబంధిత అధికారులు చెప్పేవారు. ఈ చట్టం ద్వారా నేరుగా రెవెన్యూ అధికారి విచారణ చేసి నిర్ణయం తీసుకునే అధికారం ఉంది. న్యాయం కోసం రెండంచెల అప్పీల్ వ్యవస్థను తెచ్చారు. ఈ చట్టం సక్రమంగా అమలు జరిగితే నిజమైన రైతులకు న్యాయం జరుగుతుందనే ఆశాభావం రైతులు, ప్రజల్లో నెలకొంది.

భూ భారతి చట్టం ఎంతో ఉపయోగం

వేముల రాజ్‌కుమార్, తహసీల్దార్, నెక్కొండ

ఫటా ఫట్



ఆంధ్రజ్యోతి : భూ భారతి చట్టం ఏ భూములకు వర్తిస్తుంది ?

తహసీల్దార్ : వ్యవసాయ భూములకు, వ్యవసాయేతర భూములకు, ఆబాదీలకు ఈ చట్టం వర్తిస్తుంది.

ఆంధ్రజ్యోతి : ఈ చట్టం వర్తించని భూములు ఏవి ?

తహసీల్దార్ : ప్రభుత్వ, జాగీరు, ఇనాం భూములకు వర్తించదు.

ఆంధ్రజ్యోతి : భూధార్ కార్డుల ఉపయోగం ?

తహసీల్దార్ : డిజిటల్‌ఇండియా భూమి రికార్డుల ఆధునీకరణ పథకంలో భాగంగా ప్రతీ భూ కమతానికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య (యూఎల్‌పీ/భూఆధార్/ భూధార్) ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం సూచిస్తుంది.

ఆంధ్రజ్యోతి : భూధార్ కార్డులు ఎప్పటినుంచి రైతులకు ఇస్తారు ?

తహసీల్దార్ : ఈ కార్డుల పంపిణీకి గాను గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు.

ఆంధ్రజ్యోతి : భూ రికార్డుల నకలు పొందడం ఎలా ?

తహసీల్దార్ : భూమి హక్కుల రికార్డులు భూ భారతి పోర్టల్‌లో అందరికీ అందుబాటులో ఉంటాయి. భూ హక్కుల రికార్డు సర్టిఫైడ్ కాపీ కావాలంటే భూ భారతిలో ఉన్న ఫారంలో పది రూపాయల ఫీజు చెల్లించి దరఖాస్తు చెయ్యాలి. తహసీల్దార్ సర్టిఫైడ్ కాపీ జారీచేస్తారు.

- నెక్కొండ (ఆంధ్రజ్యోతి)

బాధితుడికి పరామర్శ



రామరాజును పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే పెద్ది

దుగ్గొండి, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన తుమ్మలపెల్లి రామరాజుకు ఇటీవల విద్యుదాఘాతంతో గాయాలు కాగా, హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సందర్శించి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఝాన్సీరెడ్డి

రాయపర్తి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పానీష్ తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు బానోతు సురాళీ అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జీ ఝాన్సీ రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం తండాకు చెందిన కునేసోత్ ప్రమణ్ కుమార్ ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మండలపార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మండలంలోని మహబూబ్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బీరెల్లి మహేందర్ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

బాధిత కుటుంబాలకు చేయూత

వర్ధన్నపేట రూరల్ (పర్వతగిరి), మే 14 (ఆంధ్రజ్యోతి) : పర్వతగిరి మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన బేతి సాంబయ్య, ముద్రబోయిన పట్టాభిలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా, బుధవారం మాజీ సర్పంచ్ అమడగాని రాజు ఆధ్వర్యంలో 50కేజీల బియ్యం అందించి బాధిత కుటుంబానికి చేయూతగా నిలిచారు. పట్టపురం వెంకట్, చందసాని అశోక్, సమ్మయ్య, రమేష్, సాంబయ్య ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

రాయపర్తి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊకల్ గ్రామ శివారు బాలనాయక్ తండాలో ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ తగిలి ఎద్దు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బానోతు వెంకన్నకు చెందిన ఎద్దు వ్యవసాయ క్షేత్రంలో గడ్డి మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో రైతుకు రూ.65వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

గ్రామీణస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి



వరంగల్‌లో గంటా రవికుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న భిక్షపతి

వర్ధన్నపేట రూరల్ (పర్వతగిరి) , మే 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ స్థాయిలో బీజేపీని బలోపేతం చేసేందుకు కృషిచేయాలని వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంటా రవి కుమార్ సూచించారు. బుధవారం నూతనంగా పర్వతగిరి మండల అధ్యక్షుడిగా ఎన్నికైన చీమల భిక్షపతి యాదవ్ వరంగల్‌లో జిల్లా అధ్యక్షుడు గంటా రవి కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే నాయకులను బీజేపీ గుర్తిస్తుందని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఉత్సాహంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాటోతు రవి, బొట్ల మధు పాల్గొన్నారు.

దరఖాస్తులు క్షుణంగా పరిశీలించాలి

• కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వర్ధన్నపేట, మే 14 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టం కింద రైతులు, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. బుధవారం వర్ధన్నపేట మునిసిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన భూ భారతి సదస్సుకు హాజరై రైతుల భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం ఆధారంగా రైతులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. రెవెన్యూ సదస్సుల్లో భూ రికార్డుల్లో పేర్లు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు సర్వే నంబర్ మిస్సింగ్, పట్టా పాస్‌బుక్ లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నివారణ, పార్ట్ బీలో చేర్చిన భూముల సమస్యలు తదితర అంశాలపై దరఖాస్తులు స్వీకరించామన్నారు. కొత్త ఆర్ఓఆర్ చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పరిష్కారం చూపుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, తహసీల్దార్ విజయ్‌సాగర్, మునిసిపల్ కమిషనర్ సుధీర్‌కుమార్, ఆర్ఐ అసిఫ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రైతుల దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ సత్యశారద

వ్యాపార లైసెన్సులు తప్పనిసరిగా తీసుకోవాలి

వర్ధన్నపేట రూరల్ (పర్వతగిరి), మే 14 (ఆంధ్రజ్యోతి) : పర్వతగిరిలో వ్యాపారం చేస్తున్న ప్రతీ దుకాణదారుడు గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి లైసెన్సు తీసుకోవాలని వరంగల్ జిల్లా పంచాయతీ అధికారి కటకం కల్పన సూచించారు. బుధవారం మండల కేంద్రంలో పలు వ్యాపార సముదాయాలు పరిశీలించి వారికి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో తాగునీటి సరఫరాల తీరు, నర్సరీలోని మొక్కలు, వర్మీ కంపోస్టు, గ్రామంలో పారిశుధ్యం నిర్వహణలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు ఎప్పటికప్పుడు లైసెన్సు వారిపై నిఘా పెంచాలన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే విధంగా వ్యవహరిస్తే తగిన జరిమానా విధించాలన్నారు. గ్రామ పంచాయతీ ఆదాయాలను పెంచి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. మొక్కలకు సకాలంలో నీరుపోయాలని, వాటిని సంరక్షించాలని ఆదేశించారు. కంపోస్టు ఎరువును తూచ తప్పకుండా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు నీటి సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పంచాయతీ అధికారి వేదవి, కార్యదర్శి రఘు, తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి కల్పన

కంకరతో ఇబ్బందులు

• రోడ్డు పనులు పూర్తి చేయడంలో కాంట్రాక్టర్‌లు విఫలం

• పట్టించుకోని అధికారులు

సంగెం, మే 14 (ఆంధ్రజ్యోతి) : రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి చేతులు దులుపుకుంటున్న ప్రభుత్వం రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాలకు ప్రభుత్వం నిధులను మంజూరు చేయడంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పూర్తి చేయక అసంపూర్తిగా వదిలి వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికి పట్టించుకున్ననాధుడు లేడని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డుపై కంకరపోసి వదిలివేయడంతో రోడ్డుపై ప్రయాణం సాగిస్తున్న వాహనదారులతో పాటు వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కంకరతేలి ఉండడంతో పశువులు కాళ్లకు దెబ్బలు ఊడి పశువులు ఇబ్బందులు పడుతున్నాయని ప్రజలు చెప్పారు. మండలంలోని మొండ్రాయి గ్రామం నుంచి చింతలపల్లి వరకువేసిన రోడ్డు అసంపూర్తిగా వదిలివేయడం వలన రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురువుతున్నాయని వాపోతున్నారు. ఆదే విధంగా ఆశాలపల్లి క్రాస్‌రోడ్‌నుంచి గ్రామం వరకువేసిన రోడ్డు పనులు పూర్తికాక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న వి షయం అధికారుల దృష్టికి తీసుకవచ్చినప్పటికీ ఫలితం లేకుండపోయిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు.



ఆశాలపల్లిలో అసంపూర్తిగా నిర్మించిన కంకరరోడ్డు

ఎన్ని సార్లు చెప్పినా ఫలితం లేదు

తోట ప్రభాకర్, ఆశాలపల్లి



క్రాస్‌రోడ్ నుంచి గ్రామం వరకు వేసిన కంకర రోడ్డు పనులు పూర్తి చేయాలని గ్రామానికి వచ్చిన అదికారుల దృష్టికి తీసుక వచ్చిన ఫలితంలేదు.పశువులు ఇబ్బందులు పడుతున్నాయి. వ్యవసాయ పనులకు వెళ్లెందుకు ఇబ్బందులున్న పట్టించుకోవడంలేదు పనులు పెండింగ్ పెట్టడం వలన రాబోయో రోజుల్లో దారినుంచి వెళ్ళె ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.



మొండ్రాయి నుంచి చింతలపల్లి వరకు నిర్మించిన రోడ్డు

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

• నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



ఆలయ ముఖద్వార తోరణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొంతి

ఖానాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. బుధరావుపేట వెంకటేశ్వరస్వామి ఆలయపుష్కర బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో నూతనంగా నిర్మించిన ముఖద్వార తోరణాన్ని (ఆర్చిని) ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్ రెడ్డి, పెండె రామానంద్, వేములపల్లి వెంకటప్రసాదరావు, మోడెం ఎల్లగౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ మహాలక్ష్మి వెంకటనర్సయ్య, ఉపాధ్యక్షుడు గిరగాని నర్సయ్య, సహాయ కార్యదర్శి చెడిపాక ఉపేందర్, కొండ్ల మధు, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ భక్తుల జెండా పండుగ వేడుకలు

దుగ్గొండి, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మంపేటలో బుధవారం ఆంజనేయ మాలధారులు ఘనంగా జెండా పండుగ నిర్వహించారు. గ్రామంలో డీజే పాటలతో ఆంజనేయస్వామి భక్తి పాటలు పాడుతూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురు వారికి స్వాగతం పలుకుతూ టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రడం రాజేందర్, భూమ సదయ్య, మ్యాక రాజు, దండు రమేష్, రవీందర్, గిన్నె స్వామి, తెప్ప చిన్ని, రాజేందర్, ఓంకార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పెద్దమ్మతల్లి పూజలు చేయాలి

దుగ్గొండి, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పెద్దమ్మతల్లి పూజలు చేయాలని, అందుకు ప్రభుత్వం దేవదాయ శాఖ వారు విధివిధానాలు తయారుచేయాలని మెపా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. మండలంలోని నారక్కపేటలో బుధవారం పెద్దమ్మతల్లి గుడి ప్రారంభోత్సవంలో పులి దేవేందర్ పాల్గొని మాట్లాడుతూ ముదిరాజ్ కులస్థులు ఐక్యంగాఉండి అభివృద్ధికి పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధి కృష్ణంరాజు, నటరాజ్, పెండ్యాల కృష్ణ, పొన్నం రాజు, కిషన్, పోలు దాసరి రాము, గూబరాజు, భూమ నరేశ్, యాట రవికుమార్,కావటి శ్రీను, పెసరు కుమారస్వామి, సురేశ్, వంశీ, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్టత కార్డులు తప్పనిసరి

నెక్కొండ, మే 14 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల ద్వారా రైతులు లబ్ధి పొందుటకు రైతు విశిష్టత కార్డులు తప్పనిసరని మండల వ్యవసాయాధికారి నాగరాజు తెలిపారు. మండలంలోని పనికర గ్రామంలో బుధవారం రైతు విశిష్టత కార్డుల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి కిసాన్ యోజన, సబ్సిడీ ఎరువుల, విత్తనాలు పొందాలన్నా కార్డు తప్పనిసరి అన్నారు. అలాగే ఈ కార్డుతో కలిగే ప్రయోజనాల గురించి ఏవో వివరించారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో చేపడతామని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణధికారి వసంత, రైతులు పాల్గొన్నారు.

చేతిపంపు ప్రారంభం

నర్సంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మాధన్నపేట రోడ్డులోని కారల్ మార్క్స్ కాలనీలో న్యాయవాది కందికట్ల వీరేష్ సహకారంతో బాల వికాస వాటర్ ప్లాంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేతి పంపును బుధవారం ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పుచ్చకాయల కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మామిడాల ప్రశాంత్‌గౌడ్, దొమ్మటి సంతోష్, అరీఫ్ ఆరిఫ్, శివ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

వరంగల్ క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వరంగల్ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న డి.రమణమూర్తిని హైదరాబాద్ మల్టీజోన్-1 కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో సిద్ధిపేట కమిషనరేట్‌లోని కమ్యూనికేషన్ విభాగంలో పనిచేస్తున్న జె.శ్యాంసుందర్‌ను వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు కేటాయిస్తూ ఉత్తుర్వుల్లో పేర్కొన్నారు.

గుడుంబా రవాణాదారుల అరెస్టు

కాజీపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): గుడుంబా రవాణా చేస్తున్న ముగ్గురిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. కాజీపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.చెన్నారావుపేట, ఇండ్యా తండాకు చెందిన గుగులోతు బాలి, మరో ఇద్దరు వ్యక్తులు కాజీపేట రైల్వేస్టేషన్ నుంచి ఆటోలో బుధవారం గుడుంబా తరలిస్తుండగా పక్కా సమాచారంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆటోతోపాటు గుడుంబా తరలిస్తున్న గుగులోతు వాలి, పల్లెపు సాంబరాజు, పల్లెపు మహేశ్‌లను అదుపులోకి తీసకుని 12 లీటర్ల గుడుంబా, ఆటో, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. ఆ దాడుల్లో ఎస్సై తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ ఖలీల్, కోటిలింగం, అయూబ్, పృథ్వీ, శివాని పాల్గొన్నారు.